క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



పేద ముస్లింలకు బట్టలు పంపిణీ చేస్తున్న

నరసాపురం రూరల్: రంజాన్ మాసం సందర్భంగా నరసాపురం అంజుమన్ భవనంలో మంగళవారం పేద ముస్లింలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజుమన్ అధ్యక్షుడు షేక్ బులిమస్తాన్ మాట్లాడుతూ లోకాన్ని సృష్టించిన దేవుడు.. మనిషి నియంత్రణ కోల్పోయే ప్రమాదం నుంచి రక్షించాలని ప్రతి సంవత్సరం ప్రత్యేకించి ఒక నెల పాటు మనిషిని సంస్కరించేందుకు రంజాన్ మాసాన్ని సృష్టించాడన్నారు. నెల రోజుల పాటు తనకు అత్యవసరమైన ఆహార పానీయాలు వదిలి కనీసం ఉమ్మి కూడా మింగకుండా పరమనిష్ఠతో ఉంటాడన్నారు. నిరంతరం దైవ ప్రార్థనలో ఉంటూ ప్రాపంచిక విషయాలకు దూరంగా ఉంటారన్నారు. సంవత్సరం అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 500 కుటుంబాలకు చెందిన పేదలకు దుస్తులు పంచుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ దావూద్ ఖాన్, ఎండీ మౌలాలిఖాన్, బడేవలి, అయూఖాన్, ఖాజా, సయ్యద్ వలి, బషీర్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా



ఆచంటలో సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి స్వామి నాయుడు

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉండడంతో సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, టెలిగ్రామ్, పేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌లపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు తెలిపారు. మంగళవారం ఆచంట నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ తప్పుదారి పట్టించే సమాచారాన్ని, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, విడియోలు ఎవరూ పెట్టవద్దని, పార్వర్డ్ చేయకూడదని తెలిపారు. అతిక్రమిస్తే ఐపీసీ 153(ఏ) క్రింద చర్యలు తప్పవని హెచ్చరించారు. తప్పుడు వార్త ప్రచారాలకు పాల్పడే వారిని, రెండు వర్గాల మధ్య విద్వేషాలకు దారి తీసే, విద్వేషాలు సృష్టించే సమాచారాన్ని వైరల్ చేసినా, ఎవరైనా ప్రలోభ పెట్టినా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ఫోన్ నం.08814 297299కు సమాచారం అందించాలన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల తనిఖీలు

పాలకొల్లు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పరిమితి కన్నా ఎక్కువ నగదు రవాణా చేస్తే దానికి సంబంధించిన ఆధారాలు తనిఖీ సమయంలో అధికారులకు చూపించి సహకరించాలని ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్, మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కొర్రా గోవింద రాజులు తెలిపారు. పాలకొల్లు పట్టణంలోని గాంధీబొమ్మల సెంటర్‌లో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వాహన యజమానుల వద్ద ఉన్న నగదు పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సహాయ అధికారులు ఎస్.సీతారాముడు, పి.రాజశేఖర్, ఎంవీ దుర్గాప్రసాద్, ఎం.సునీల్‌కుమార్ వాహనాలను తనిఖీ చేశారు.

పింఛన్‌లు అడ్డుకోవడం దుర్మార్గపు చర్య



చిట్టూరి కనకలక్ష్మి

పాలకొల్లు అర్బన్: ప్రతి నెలా 1న అవ్వాతాతలకు అందించే పింఛన్లను చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు అడ్డుకున్నారని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి మండిపడ్డారు. యాళ్లవాని గరువులో ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఓటమి భయం పట్టుకుందన్నారు. దీంతో వలంటీర్లపై విషం కక్కుతున్నారని ఆరోపించారు. వలంటీర్లు గౌరవ వేతనం తీసుకుంటూ, లంచాలకు, అవినీతికి అవకాశం లేకుండా నిస్వార్థంతో సేవలందిస్తున్నారన్నారు. వలంటీర్లను తీవ్రవాదులుగా, డేటా దొంగిలించే దొంగలుగా, మహిళలను అక్రమ రవాణా చేసే ముఠాగా వర్ణించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

ముఖదారమ్మ జాతర ఉత్సవాల వాల్‌పోస్టర్ విడుదల

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావిచెరువుగట్టున ఉన్న శ్రీ ముఖదారమ్మ జాతర మహోత్సవాలు సందర్భంగా అమ్మవారి వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కుంపట్ల చిన్నరాజా మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయన్నారు. 15 వరకూ వారం రోజులు పాటు అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడ్డాల ఏడుకొండలు చెక్కా కృష్ణ, కొలుకులూరి కృష్ణ, కొల్లంశెట్టి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

రాజీనామాల బాటలో వలంటీర్లు

- వందల సంఖ్యలో వలంటీర్ల రాజీనామాలు
- చంద్రబాబు తీరుపై వెల్లువెత్తుతున్న నిరసనలు
- పింఛను సొమ్ము అందక అవ్వాతాతల శాపనార్థాలు



పెనుగొండ సచివాలయం-01లో రాజీనామా సమర్పిస్తున్న వలంటీర్లు

పెనుగొండ: తెలుగుదేశం, పచ్చమీడియా చేష్టలతో విసుగు చెందిన వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నారు. ఆచంట నియోజకవర్గంలోని పెనుగొండ, పెనుమంత్ర, ఆచంట, పోడూరు మండలాల్లో 300 మందికి పైగా వలంటీర్లు మంగళవారం రాజీనామాల బాట పట్టారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి టీడీపీ నాయకులు వెంటాడుతూ, నిత్యం గమనిస్తూ తమను తీవ్ర మానసిక క్షోభకు గురి చేశారన్న భావన వలంటీర్లలో అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో పెనుమంత్ర, పెనుగొండ మండలాల్లో పలువురు వలంటీర్లపై ఎన్నికల అధికారికి ఫిర్యాదులు చేశారు. దీంతో పాటు చంద్రబాబు జేబు సంస్థ నుంచి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో పింఛన్ల పంపిణీ సైతం అడ్డుకోవడంతో వలంటీర్లు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. పెనుగొండలో 5 సచివాలయాల పరిధిలో ఇప్పటికే 80 మందికి పైగా వలంటీర్లు రాజీనామా చేయగా, మిగిలిన వారూ బుధవారం రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. వీరి బాటలోనే మిగిలిన వారు ముందుకు సాగుతున్నారు.



ములపర్రులో రాజీనామాలు సమర్పిస్తున్న వలంటీర్లు



దొంగరావిపాలెంలో రాజీనామా చేసిన వలంటీర్లు

అవ్వాతాతల ఆక్రోశం

ఇదిలా ఉండగా గత నెల వరకూ 1న వేకువజామునే లబ్ధిదారుల చేతికి అందిన పింఛను సొమ్ము.. ఈ నెల ఇంకా పింఛను రాకపోవడం, సచివాలయాలకు వెళ్లి పింఛను సొమ్ము తీసుకోవాలంటూ ప్రచారం చేస్తుండడంతో తీవ్ర ఆక్రోశానికి గురవుతున్నారు. మళ్లీ ఎండల్లో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు తప్పవా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబుకు అవ్వాతాతల ఉసురు తగులుతుందంటూ శాపనార్థాలు పెడుతున్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

పెనుమంత్ర/యలమంచిలి: టీడీపీ కూటమి చేస్తున్న అవమానాలు, వేధింపులు భరించలేని పలువురు వలంటీర్లు మంగళవారం కూడా తమ పదవులకు రాజీనామాలు చేస్తూ కార్యదర్శులకు సమర్పించారు. మండలంలో ఇప్పటి వరకు 70 మందికి పైగా వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఆయా గ్రామ కార్యదర్శులకు అందజేశారు. ఇప్పటి వరకు మార్టేరులో నలుగురు, వెలగలేరులో ఇద్దరు., నత్తారామేశ్వరంలో 12, ఎస్ ఇల్లిందలపర్రులో 11, పాలమూరులో 27 మంది జుత్తిగలో 13 మంది వలంటీర్లు రాజీనామాలు సమర్పించినట్లు కార్యదర్శుల నుంచి నివేదిక అందినట్లు ఎంపీడీఓ పద్మజ మంగళవారం తెలిపారు. యలమంచిలి మండలం ఏనుగునివానలంక వలంటీర్ సందీప్ కూడా తన రాజీనామా పత్రాన్ని గ్రామ కార్యదర్శికి అందించాడు.

మంచం దగ్గరకే వచ్చి ఇచ్చేవారు



ఇతని పేరు రాపాక కనికిరెడ్డి. పెనుగొండలోని రాజుగూడెంకు చెందిన 75 ఏళ్ల ముదుసలి. మంచం విడిచి తిరగలేని పరిస్థితి. ప్రభుత్వం అందించే వృద్ధాప్య పింఛను సొమ్మే ఇతనికి ఆధారం. ఈ నెల 1న పింఛను అందలేదు. పింఛను సొమ్ము తీసుకునేందుకు సచివాలయానికి వెళ్లాలంటూ స్థానికులు చెప్పడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. మంచం దిగి నడవ లేని పరిస్థితులో ఉన్నా.. సచివాలయానికి వెళ్లలేనంటూ వలంటీర్‌కు చెప్పగా, ఈ సారి మేము ఇవ్వకూడదంటా అని వలంటీర్ విషయం చెప్పడంతో దీనికి కారణమైన వారిని శాపనార్థాలు పెట్టాడు.

తెల్లవారకముందే చేతిలో పింఛను



నా పేరు ఎస్.ధనలక్ష్మీ, చెరుకువాడ పంచాయతీ చిన్నంవారి పాలెం మా గ్రామం. సీఎం జగన్ పాలనలో వలంటీర్లు తెల్లవారక ముందే ఇంటికి వచ్చి పింఛను ఇచ్చేవారు. పింఛను కోసం నేను ఎప్పుడూ నిరీక్షించింది లేదు. ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచనుగా ఇంటికి వచ్చి నిద్ర లేపి పింఛను ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. వలంటీర్లపై అక్కసు వెళ్లగక్కి వారు పింఛను ఇవ్వకుండా చంద్రబాబు అడ్డుపడడం దారుణం. పింఛను దారులు వలంటీర్లకు ఎప్పటికీ రుణపడి ఉంటారు. వారికే మా మద్దతు.

సచివాలయాల్లోనే పింఛన్ల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఎంవీ రమణారావు

నరసాపురం రూరల్: జిల్లా కలెక్టర్ ఆదేశాలు, ఎన్నికల అధికారుల సూచనలతో అన్ని గ్రామ సచివాలయాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు నరసాపురం ఎంపీడీఓ రమణారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. సామాజిక పింఛన్ల లబ్ధిదారులు సచివాలయాలకు వచ్చి తీసుకోవాలని, ఇక్కడ ఎలాంటి తోపులాటలు, ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. 3న బ్యాంకు నుంచి నగదు తీసుకుని వచ్చి సచివాలయాల వారిగా ఉన్న పింఛనుదారులకు అవసరమైన సొమ్ములు అందజేస్తామని, పింఛన్ల పంపిణీ 4వ తేదీనుండీ గ్రామ సచివాలయాల వద్ద నిర్వహిస్తున్నట్లు గ్రామాల్లో టాంటాం వేయించాలన్నారు. పింఛన్ల కోసం వచ్చే లబ్ధిదారులు ఆధార్ కార్డును తీసుకురావాల్సి ఉంటుందన్నారు. నరసాపురం మండలంలో 11,527 పింఛన్ల పంపిణీకి క్లస్టర్‌ల వారీగా సచివాలయ సిబ్బందిని కేటాయించామన్నారు. సచివాలయాల్లో తాగునీరు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయడం, అవసరమైతే టెంట్‌లు వేయించడంతో పాటు వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచాలన్నారు. వికలాంగులు, మంచంపై ఉన్న రోగులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇంటికి వెళ్లి పింఛన్‌లను అందించాలని ఎంపీడీఓ కోరారు. సమావేశంలో ఈఓపీఆర్డీ కె.ఆంజనేయశర్మ, మండలంలోని కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి చూసి ఓటెయ్యండి

చీఫ్ విప్ ప్రసాదరాజు



ముత్యాలపల్లిలో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీ అభ్యర్థినైన తనకు ఓటు వేయాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ముత్యాలపల్లి గ్రామంలోని చింతరేవు కాలువ, కట్టావారిమెరక, గెదళ్ళ వంపు, సాధనాలవారి మెరక తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ తనను ఆశీర్వదించాలని కోరారు. కట్టావారిమెరకలో మహిళలతో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, సున్నా వడ్డీపై మహిళలు వ్యక్తపరిచిన అనుమానాలు నివృత్తి చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరేలా వాలంటరీ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. గతంలో ఈ గ్రామంలో ఒక పంచాయతీ కార్యాలయం నలుగురు ఉద్యోగులు ఉండేవారని ప్రస్తుతం రెండు సచివాలయాలు, 20 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ గ్రామంలో చింతరేవు, గెదళ్ళ వంపు, ముత్యాలపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి లక్షలాది రూపాయలతో పైప్‌లైన్‌లు, కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన ప్రాంతాల్లోనూ తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. నాడు–నేడు పథకంలో కోట్లాది రూపాయలతో ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేశామని వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు, కులాలు, మతాలకు అతీతంగా లబ్ధి చేకూరాలంటే ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని మరోసారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటును ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గూడూరి ఉమాబాలకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బందన పూర్ణచంద్రరావు, నాయకులు రేవు రాంబాబు, బర్రి సామేలు. తిరుమాని పెద్దిరాజు, సత్యనారాయణ, రేవు నారాయణమూర్తి, సాధనాల నాగరాజు, రాము, బండి ముత్యాలమ్మ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఓసూరి విజ్జిబాబు, కడలి నాగార్జున, దొంగ యుగంధర్, కొల్లాటి రామారావు, కాకిలేటి ఆనంద్ కుమార్, చినిమిల్లి చందు, అయితం యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలపల్లి పంచాయతీ కట్టావారిమెరకలో మహిళలకు అందిన లబ్ధిని వివరిస్తున్న ప్రసాదరాజు

కూటమిలో ఓటమి గుబులు



తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం



తూర్పుపాలెంలో ఆచంట మండల కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ప్రజలంతా టీడీపీ వారి కూటమి చేస్తున్న కుయుక్తులతో అసహ్యించుకుంటున్నారని, దీంతో వారికి ఓటమి భయం ఎన్నికల ముందే ప్రారంభమైందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో ఆచంట మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమమే శ్రీరామరక్షగా నిలుస్తుందన్నారు. ప్రతి కుటుంబానికీ సీఎం జగన్ మంచి చేశారన్నారు. దీంతో ప్రతి కుటుంబం నుంచీ వైఎస్సార్ సీపీకి ఓట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అంతేగాకుండా, ఆచంట నియోజకవర్గంలో అందించిన సంక్షేమం, అబివృద్ధి, సేవా కార్యక్రమాలతో వారి గుండెల్లో గుబులు రేపుతుందన్నారు. దీంతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దీంతో నిత్య ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారం చేయడానికి ప్రయత్నించి విఫలమవుతున్నారన్నారు. ప్రజలందరికీ పాలుకు, నీరుకి తేడా తెలుసునన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడ్డవారేవరో ప్రజలకు తెలుసునన్నారు. జన్మభూమి కమిటీలతో పేద ప్రజలను ఎవరు దోచేశారో? ప్రజలకు తెలుసునన్నారు. ఐదేళ్ల పాలనలో కార్యకర్తలు అందరూ పారదర్శకంగా ఉన్నారన్నారు. వలంటీరు వ్యవస్థతో పేదలకు పారదర్శకంగా సంక్షేమం అందిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ చిల్లే లావణ్య, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరక్టరు మామిడిశెట్టి కృష్ణవేణి, మండల కన్వీనరు జక్కంశెట్టి చంటి, మాజీ ఎంపీపీ మట్టా ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి

రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త, నాయకుడూ కృషి చేయాలని మాజీ మంత్రి , వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలో కార్యాలయంలో నూతనంగా నియమితులైన ఆచంట మండల ఎస్సి సెల్ అధ్యక్షులుగా కొడమంచిలి అరుంధతిపేటకు చెందిన ఆకుమర్తి రాంబాబు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను నమ్మకంగా పని చేసి పార్టీకి, ముఖ్యంగా శ్రీరంగనాథరాజు గెలుపు లో ప్రముఖ పాత్ర వహిస్తానన్నారు. కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, ఉప సర్పంచ్ ములగాడ వరప్రసాద్, ఆచంట మండల వైఎస్సార్ సీపీ మహిళ విభాగం అధ్యక్షులు కొండేటి లక్ష్మి, సచివాలయ కన్వీనర్‌లు కొండేటి వరప్రసాద్,గున్నాబత్తుల వెంకటాచారి పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా పాలకొల్లు



శంభునిపేటలో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు ప్రజలు తనకు ఒక అవకాశం ఇస్తే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహ కారంతో రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చెప్పారు. పాలకొల్లు పట్టణంలోని 11వ వార్డు శంభునిపేట, రామయ్యహోలు, ముచ్చర్లవారిపుంత, జీ+1 లేఅవుట్ ప్రాంతాల్లో మంగళవారం ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు, దివ్యాంగులు, వితంతులు ఈ నెల పింఛన్ సొమ్ములు ఇంకా అందలేదని గోపి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందించి అవ్వాతాతల పింఛన్లు నిలిచిపోవడానికి దుష్ట చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కారణమని వివరించారు. చంద్రబాబు, పవన్‌లకు ఓటేస్తే సంక్షేమ పథకాలన్నీ నిలిపివేస్తారని ఓటర్లకు వివరించారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ చింతలపూడి పరిశీలకులు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మద్దా చంద్రకళ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, వార్డు ఇన్‌చార్జ్ కోట రత్నరాజు, వార్డు నాయకులు , పైలా రాజేశ్వరి, మెడవల రాజా, నల్లి జయరాజు, ఉండ్రాజవరపు రవి కుమార్, పిట్టా రాజ్‌కుమార్, శిడగం రమణ, పీతల ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఓటు వేయాలని కోరుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

ఉత్సాహంగా ఇంటింటి ప్రచారం



మొగల్తూరు: కాళీపట్నం పడమర గ్రామంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ప్రసాదరాజు భార్య శారదా వాణి



పాలకొల్లు అర్బన్: శంభునిపేటలో ప్రచారం చేస్తున్న గుడాల గోపి భార్య మంగతాయారు

మొగల్తూరు: నరసాపురం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు భార్య శారదావాణి ఓటర్లను కోరారు. మంగళవారం మొగల్తూరు మండలంలోని కాళీపట్నం పడమర గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరుగుతూ గత ప్రభుత్వాలకు, జగనన్న ప్రభుత్వానికి తేడా గమనించాలని కోరారు. గతంలో మీ గ్రామంలో జరిగిన అభివృద్ధికి, ఈ ఐదు సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకోవాలన్నారు. ముదునూరి ప్రసాదరాజు ఎమ్మెల్యే అయిన తరువాత గ్రామంలోని లింక్ రోడ్లను అభివృద్ధి చేశారని, శిథిలావస్థకు చేరిన వంతెన తొలగించి రెండు లైన్ల వంతెన, కాళీపట్నం గ్రామం నుంచి పాతపాడు వరకూ రూ.12 కోట్లతో రహదారులను అభివృద్ధి చేశారన్నారు. అంతేకాక రూ.2.50 కోట్లతో ఆసుపత్రి నిర్మిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నరసాపురం మున్సిపల్ చైర్మన్ బర్రి వెంకటరమణ, మున్సిపల్ కౌన్సిలర్ కావలి రామసీత నాని, సిర్రా కాంతమ్మ, పెదసింగ్ రామలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజి, వైస్ ఎంపీపీ కవురు సీతామహలక్ష్మి సర్పంచ్ కవురు సావిత్రి, నాయకులు దొంగ నాగముని, కవురు సుబ్రమణ్యం, జక్కంశెట్టి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలిచి వైఎస్సార్ సీపీ తరపున పాలకొల్లులో పోటీ చేస్తున్న తన భర్త గుడాల గోపిని గెలిపించాలని గోపి భార్య మంగతాయారు, కుమారుడు సాయిబాలాజీ కోరారు. పాలకొల్లు పట్టణంలోని శంభునిపేటలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి తన భర్తను ఆశీర్వదించాలని మంగతాయారు కోరారు. ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపిలకు రెండు ఓట్లు సీలింగ్ ఫ్యాన్ గుర్తుకి వేయాలని అభ్యర్థించారు.